శిథిలావస్థలో రైల్వే క్వార్టర్లు

- ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు
- స్థలాలు ఉన్నా నిర్మాణాలపై దృష్టి నిల్
- కొత్త నిర్మాణాలు చేపట్టాలని జీఎంకు వినతి


శిథిల స్థితికి చేరిన రైల్వే ఎంప్లాయిస్ క్వార్టర్లు

సామర్లకోట: అధికారులు అందుబాటులో ఉండేందుకు నిర్మించిన రైల్వే క్వార్టర్స్ శిథిలావస్థకు చేరాయి. వాటి స్థానంలో కొత్త నిర్మాణాలు చేపట్టకపోవడంతో అనేక మంది ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. సామర్లకోట రైల్వే స్టేషన్ పరిధిలో సుమారు 850 మంది వివిధ శాఖల ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరి కోసం సుమారు 50 ఏళ్ల క్రితం క్వార్టర్సు నిర్మించారు. వీటిలో అనేక క్వార్టర్సు శిథిలం కావడంతో వాటిలో రైల్వే ఉద్యోగులు నివాసం ఉండడం లేదు. ప్రస్తుతం 98 మంది మాత్రమే నివాసం ఉంటున్నట్టు అధికారులు చెబుతున్నారు. స్థానిక సత్యనారాయణపురం వెళ్లే మార్గంలో సుమారు 15 ఏళ్ల క్రితం క్వార్టర్లను కూల్చి వేశారు. ఆ స్థలం నిరుపయోగంగా ఉండడంతో అసాంఘిక కార్యక్రమాలు నిలయంగా మారింది. ఇక్కడ పీడబ్ల్యూఐ, ఐఓడబ్ల్యూ కార్యాలయాల వద్ద ఉద్యోగుల ఇండివిడ్యువల్ క్వార్టర్సు ఉన్నాయి. అవి కూడా శిథిలం కావడంతో పాటు వర్షపు నీరు క్వార్టర్సులోనికిపోతోంది. వాటిలో ఎవరూ నివాసం ఉండకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి.

మూడు ప్రదేశాల్లో అపార్టుమెంట్లలో...

రైల్వే స్టేషన్ పరిధిలో పీడబ్ల్యూఐ కార్యాలయం, మజ్దూర్ యూనియన్ కార్యాలయం, రైల్వే ఆస్పత్రి వద్ద అపార్టుమెంట్లతో కూడిన రైల్వే కార్టర్లు ఉన్నాయి. ఇవి కూడా శిథిల స్థితికి చేరడంతో చాలా మంది క్వార్టర్లను ఖాళీ చేశారు. ఈ మూడు క్వార్టర్సును నిర్మించి 40ఏళ్లు దాటింది. రైల్వే ఉద్యోగులకు వారికి బేసిక్ పే పై 9 శాతం హెచ్‌ఆర్‌ఏ వస్తుంది. దాంతో ప్రతి ఉద్యోగికి రూ.1,600 నుంచి రూ.ఏడు వేల వరకు హెచ్‌ఆర్‌ఏ వచ్చే అవకాశం ఉంది. ఆయా మొత్తంతో బయట అద్దె ఇళ్లు లభించే అవకాశం లేదు. రైల్వే క్వార్టర్సులో అయితే రూ.రెండు వేలకు లోపుగా క్వార్టర్సు లభిస్తుందనే వాదనలు ఉన్నాయి. ఉద్యోగుల నుంచి ఒత్తిడి ఎక్కువగా ఉంటే క్వార్టర్సు నిర్మించే అవకాశం ఉంది. రైల్వే క్వార్టర్సు కోసం రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, మజ్దూర్ యూనియన్‌లు పోరాటం చేస్తున్నట్టు ఆయా సంఘాల నాయకులు తెలియజేస్తున్నారు. ఏది ఏమైనా అత్యవసర పరిస్థితులల్లో ఉద్యోగుల అందుబాటులో ఉండడానికి క్వార్టర్సు ఉండాలనే డిమాండ్ ఉంది.


అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిన క్వార్టర్లు కూల్చిన రైల్వే స్థలం


రైల్వే ఉద్యోగుల క్వార్టర్లు నిర్మించాని రైల్వే జీఎంకు వినతి పత్రం అందజేసిన రైల్వే సంఘాల ప్రతినిధులు

మూడోలైన్ నిర్మాణం తరువాతే..



సామర్లకోట మీదుగా థర్డు లైన్ నిర్మించేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇది పూర్తయిన తరువాతే రైల్వే క్వార్టర్సును నిర్మిస్తారు. సత్యనారాయణపురం రోడ్డులో ఉన్న క్వార్టర్సు తొలగించిన స్థలంలో ఓహెఈ(ఎలక్ట్రికల్) కార్యాలయాన్ని నిర్మిస్తాం.ఒకటో నెంబరు ప్లాటు ఫాంపై చివరలో సాధారణ ప్రయాణికులకు షెడ్లు త్వరలో పూర్తి చేస్తాం. స్టేషన్ మాస్టరు కార్యాలయాలకు నూతన భవన నిర్మిస్తాం. జరుగుతుంది. దానిలో సాంకేతిక నైపుణ్యంతో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేస్తాం.

–జి.రవికాంత్, సీనియర్ ఇంజినీరు (వర్క్స్) సామర్లకోట

అద్దెభవనంలో ఉంటున్నాం..



రైల్వేలో పని చేస్తున్న ముఖ్యమైన శాఖల అధికారులకు అందుబాటులో ఉండేలా క్వార్టర్సు ఉండాలి. అయితే క్వార్టరు లేకపోవడంతో అద్దె భవనంలో నివాసం ఉండాల్సి వస్తోంది. చేయవలసి వస్తుంది. దీనిపై ఇటీవల రైల్వే జీఎం అరుణ్‌కుమార్ సామర్లకోట వచ్చిన సమయంలో సామర్లకోటలో రైల్వే క్వార్టర్సు నిర్మించాలని ఆయన దృష్టికి తీసుకు వెళ్లాం. కార్వర్సు నిర్మాణంపై రైల్వే సీనియర్ ఇంజినీరు (వర్క్స్) నిర్ణయం తీసుకోవాలి.

–ఎం.రమేష్, రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ కార్యాదర్శి, సామర్లకోట

క్లుప్తంగా

హైదరాబాద్ వెళ్లి పింఛను అందజేత


హైదరాబాద్‌లో సూర్యతేజకు పింఛను అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ వీరబాబు

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం గ్రామానికి చెందిన పిట్టా సూర్యతేజ వెన్నెముకకు శస్త్రచికిత్స చేయించుకోవడానికి హైదరాబాద్ వెళ్లాడు. ఆపరేషన్ చేయించుకుని అక్కడే చికిత్స పొందుతున్నాడు. కాగా అతను వికలాంగ పింఛను దారుడు కావడంతో కొండెవరం సచివాలయం–2 వెల్ఫేర్ అసిస్టెంట్ పొన్నాడ వీరబాబు తన సొంత ఖర్చులతో హైదరాబాద్ వెళ్లి పింఛను అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ వీరబాబును స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు


దుర్గాడ శివాలయంలో గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పిఠాపురం: సంకటహర చతుర్థిని పురస్కరించుకుని గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు ఆధ్వర్యంలో సూక్తం, ఉపనిషత్తుల పారాయణ నిర్వహించారు. ఆలయంలో గణపతికి పంచామృతాలు, చెరుకురసంతో అభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, గరికతో స్వామివారిని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

సీపీఎం సదస్సును జయప్రదం చేయండి

పెద్దాపురం: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం రాజమహేంద్రవరంలో నిర్వహించే సీపీఎం రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు పిలుపునిచ్చారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిరుద్యోగులందరూ ఈ సదస్సుకు హాజరు కావాలని సూరిబాబు కోరారు. సిరిపురపు శ్రీనివాస్, గడిగట్ల సత్తిబాబు గరగపాటి పెంటయ్య తదితరులున్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

కొత్తపల్లి: పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సోమవారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అమీనాబాదు శివారులో పేకాడుతున్నారని వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై స్వామినాయుడు తన సిబ్బందితో దాడి చేశారు. పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2,600 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. స్వామి వారికి ప్రీతైన రోజు కావడంతో తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామి వారి తొలి అభిషేకం, పూజలను తిలకించడానికి బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలి పూజ చేశారు. తరువాత భక్తుల అభిషేకాలను స్వామి వారికి చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం తరుపున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వర రావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవాదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లను ప్రత్యేక అలంకరణలు చేశారు.

నిండా ముంచేసినారు


తాటిపర్తిలో దిగుబడికి నోచుకోని మిరప పంట

- నకిలీ మిరప నారుతో మోసపోయిన రైతులు
- 50 ఎకరాల్లో పంటకు నష్టం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు

పిఠాపురం: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని నమ్మబలికి అమ్మిన మిరప నారు రైతులను నిండా ముంచేసింది. పెట్టిన పెట్టుబడులు కూడా రాక పోగా సాగు చేసిన రైతులు అప్పుల పాలయ్యారు. దీంతో తమను మోసం చేసి నకిలీ నారు అమ్మిన నర్సరీపై తగిన చర్యలు తీసుకోవాలంటూ రైతులు పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే...గొల్లప్రోలు మండలం చెందుర్తి, చేబ్రోలు, గొల్లప్రోలు, తాటిపర్తి, దుర్గాడతో పాటు కొత్తూరు నరేంద్రపట్నం తదితర గ్రామాలకు చెందిన రైతులు గండేపల్లి మండలం ఎర్రంపాలేనికి చెందిన ముత్యాల నాగేశ్వరరావు ద్వారా మదనపల్లికి చెందిన గౌతమి విజిటబుల్, కేఆర్‌పీ నర్సరీల్లో మిరప నారు కొని సాగు చేశారు. ఒక్కో మొక్క రూ.2కు కొని ఎకరానికి రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకూ పెట్టుబడి పెట్టారు.


గిడసబారిన మిరప కాయలు

50 ఎకరాల్లో సాగు

ఆయా గ్రామాల్లోని రైతులు సుమారు 50 ఎకరాల్లో ఈ కల్తీ నారుతో మిరపసాగు చేశారు. పంట నాటిన నాటి నుంచి 45 రోజుల్లో కోతకు రావాల్సి ఉండగా 90 రోజులు అయినా కోతకు రాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పొలంలో అక్కడక్కడా మాత్రమే మిరపకాయలు కాసాయి. మొక్కలు గిడసబారి పోయాయి. మిరప కాయలు 4 నుంచి 6 అంగుళాలు కాసి ఎకరానికి 12 టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా 40 కేజీలు కూడా దిగుబడి రాకపోవడంతో తాము మోసపోయామని గ్రహించిన రైతులు గొల్లప్రోలు పోలీసు స్టేషన్లో సోమవారం ఫిర్యాదు చేశారు. తమతో పాటు వేరే నారు వేసిన పంటలు బాగా పండి ఎకరానికి 12 టన్నుల వరకూ దిగుబడి వచ్చిందని, తాము మాత్రం నష్టాల పాలయ్యామని రైతులు వాపోతున్నారు. ఎక్కరానికి రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టగా పూర్తిగా నష్టపోయామన్నారు. నకిలీ నారు అమ్మిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. రైతుల ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేపట్టారు.

ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన


సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించిన దొరబాబు

సామర్లకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోట పర్యటనలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగే బహిరంగ సభ ఏర్పాట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు సోమవారం పరిశీలించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు దవులూరి సుబ్బారావు, సల్లూరి కల్యాణ్‌లు ఏర్పాట్లను పరిశీలించారు. అదే విధంగా కాకినాడ, పెద్దాపురం ఆర్డీఓలు ఎస్‌వీవీ సత్యనారాయణ, జె సీతారామారావులు వేదిక ఏర్పాటు, బహరంగ ప్రదేశంలో సిటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం తహసీల్దార్ వజ్రపు జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జె రామారావు, డీఈ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


జూనియర్ కళాశాల ఆవరణలో వేదిక ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీఓలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలకు చెందిన 1999–2002 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తరువాత తుని మండల శివారు వన్ హోటల్ సమీపంలోని తోటలో కుటుంబ సమేతంగా కలిశారు. ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఇకపై ఏటా కలుసుకోవాలని, కళాశాలకు సైతం తమవంతు సహకారం అందించాలని నిర్ణయించుకున్నారు.


20 ఏళ్ల తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు

మల్లిబాబుకు ఎంపీ గీత పరామర్శ


వాకతిప్పలో మల్లిబాబును పరామర్శిస్తున్న ఎంపీ గీత

కొత్తపల్లి: గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో వాకతిప్ప గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ మామిడి మల్లిబాబు కుమారుడు చిన్నయ్యదొర, మనుమరాలు శ్రావణి మృతి చెందారు. మల్లిబాబును ఎంపీ వంగా గీత సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసున్నారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనాలు


రవీంద్రపురంలో గణపతిని ఊరేగిస్తున్న యువకులు

కొత్తపల్లి: గణపతి నవరాత్రులు ముగియడంతో గ్రామాల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు. కొద్దిరోజులుగా ఉప్పాడ సాగర తీరంలో నిమజ్జనాల సందడి నెలకొంది. సోమవారం పలు గ్రామాల్లోని గణపతి విగ్రహాలను ఆలయ కమిటీల ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. రవీంద్రపురంలోని గణపతి ఊరేగింపులో చిన్నారులు చేసిసి నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

గొంది భూముల పరిశీలన

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానానికి శంఖవరం మండలం గొంది గ్రామంలో గల 33 ఎకరాల భూమిని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్, అటవీశాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ భూమిలో గతంలో వివిధ రకాల వృక్షాలు ఉండేవి. కొండ భూమి కావడంతో ఏ పంట సాగుచేయడానికి అవకాశం ఉండేది కాదు. ఈ భూమిలో చెట్లు, వాటి మోడులు కూడా కొట్టుకుపోయేందుకు ఓపెన్ టెండర్ కం వేలం ద్వారా ఖరారు చేశారు. అనంతరం ఈ భూమిని చదును చేయించారు. ప్రస్తుతం భూమి ఖాళీ గా ఉండడంతో ఇందులో ఏ మొక్కలు నాటాలనే దానిపై సోమవారం అటవీశాఖ అధికారులతో కలిసి దేవస్థానం చైర్మన్, ఈఓలు పరిశీలించారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

జగ్గంపేట: మండలంలో మల్లిసాలలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై నాగార్జునరాజు తెలిపారు. మల్లిసాలలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడుల్లో నక్కరాజు చంద్రబాబు, పాలిపిరెడ్డి గంగాధరరావు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.31 వేల విలువైన 150 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పెద్దాపురం కోర్టులో హాజరు పరచగా వారికి రిమాండ్ విధించినట్లు చెప్పారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు


127 మద్యం సీసాల స్వాధీనం

ప్రత్తిపాడు: గాంధీ జయంతి సందర్భంగా తనిఖీలు నిర్వహిస్తున్న ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సిబ్బందికి సోమవారం బెల్ట్ షాపుల్లో విక్రయానికి సిద్ధం చేసిన మద్యం సీసాలు పట్టుబడ్డాయి. స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ కథనం ప్రకారం ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో ముద్దా నూకరాజును అదుపులోకి తీసుకుని అతని నుంచి 102 మద్యం సీసాలను, 18 బీరు సీసాలు వెరసి 120 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కిర్లంపూడిలో ఏడు మద్యం సీసాలతో బొండ సత్తిబాబును అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ సీసాలన్నీ డ్యూటీ పెయిడ్ మద్యంగా ఉన్నాయన్నారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై బి. శ్రీనివాసరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతపై ప్రజలకు అవగాహన

జగ్గంపేట: గ్రామంలో సోమవారం విద్యుత్ భద్రత దినోత్సవం నిర్వహించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది విద్యుత్ భద్రత, ప్రమాదాల జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తపై ప్రజలకు అవగాహన కలిగించారు. విద్యుత్ వినియోగంలో పాటించవలసి నియమాలను వివరించారు. జగ్గంపేట ఈఏ ఎ.శ్రీనివాస్ లైన్‌మెన్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

200 మందికి కంటి పరీక్షలు


యర్రవరంలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆదిత్య

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రాజెక్టు ఆరోగ్యలో భాగంగా స్పార్క్ సంస్థ చైర్మన్ సాయిసందీప్ ఆధ్వర్యంలో గ్రామంలోని రావిచెట్టు రామాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు ప్రారంభించారు. ఏలేశ్వరం ఆదిత్య ఆసుపత్రి వైద్యులు సుమారు 200 మందికి కంటి పరీక్షలు చేశారు. రోగులకు సుమారు రూ.15 వేలు విలువ చేసే మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నీరుకొండ సత్యనారాయణ, బొడ్డు కృష్ణ, సంస్థ సభ్యులు అంజి, స్వామి, సుదీప్, సాహూ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ ఆశయ సాధనకు కృషి చేద్దాం

గాంధీ జయంతి వేడుకల్లో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి


పిఠాపురం వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు పుస్తకాలు అందజేసిన నాయకులు


వాకతిప్పలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దాపురం: జాతిపతి మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని ఏపీ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మహాత్మాగాంధీ జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం స్థానిక మున్సిపల్ పార్క్‌లోని గాంధీ విగ్రహానికి మున్సిపల్ చైర్ పర్సన్ బోడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీలతో కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విడదాసరి రాజా, తాటికొండ వెంకటలక్ష్మి, రాజబాబు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ జేఎస్ రామారావు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీటీ భానుకుమార్, రాజు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. స్థానిక సబ్‌జైలులో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఖైదీల సంక్షేమ దినోత్సవంలో భాగంగా సోమవారం ఏడో అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి, జూనియర్ సివిల్ జడ్జి జి.బుల్లెమ్మలు సబ్ జైలు ఆవరణలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి పలు చట్టాలపై ఖైదీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, పీపీ మృత్యుంజయరావు, ఏపీపీ నాగరాజు, పీఎల్‌విలు నూతలపాటి అప్పలకొండ, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కాండ్రకోట గ్రామంలో జెట్పీటీసీ గవరసాని సూరిబాబు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణలు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం గాంధీ జయంతిని నిర్వహించారు. స్థానిక పాత పెద్దాపురం, మెయిన్‌రోడ్డు గాంధీ విగ్రహాలకు పూల మాలవేసి నివాళులర్పించారు. స్థానిక బ్యాంక్ గాంధీ విగ్రహం వద్ద సోమవారం మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు, ఆలయ వేద పండితులు అమ్మవారి కాలక్షేప మండపంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులుర్పించారు.

పిఠాపురం: స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలోని చెలికాని భావనరావు సదన్‌లో జనవిజ్ఞాన వేదిక, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మహాత్మ గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉప్పాడ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మద్య రహిత సమాజం నిర్మిద్దాం అనే అంశంపై జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కట్టా కృష్ణారావు, జనవిజ్ఞాన వేదిక పిఠాపురం మండల కార్యదర్శి నేమిశెట్టి గంగబాబు, సోషల్ వెల్ఫేర్ విశ్రాంత డీడీ కె.అప్పారావు, న్యాయమూర్తి భాస్కర్, సీసీఆర్డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: జాతిపిత మహాత్మ గాంధీజీ, భారత రత్న, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు సోమవారం మండలంలో ఘనంగా జరిగాయి. వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాల వద్ద మహాత్మ గాంధీ విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో పూలమాలులు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలాని దొరబాబు, గవర నాగేశ్వరరావు, చొడ్డిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై స్వామినాయుడు ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసాద్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సామర్లకోట: పట్టణ పరిధిలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలోను, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఉన్న గాంధీ విగ్రహాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాలల్లో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైస్ చైర్‌పర్సను గోకిన సునేత్రాదేవి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి, రైల్వే స్టేషన్ సెంటర్‌లో రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఇండియా ప్రజాబంద్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ సెంటర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.


ఆర్డీఓ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీఓ జేఎస్ రామారావు


సామర్లకోట గాంధీచౌక్‌లో గాంధీ విగ్రహానికి పూల మాలవేస్తున్న చైర్‌పర్సన్ తదితరులు


సామర్లకోట రైల్వే స్టేషన్‌లో గాంధీ విగ్రహానికి నివాళి అర్పించిన రైల్వే అధికారులు


మున్సిపల్ పార్క్‌లో గాంధీ విగ్రహానికి దొరబాబు నివాళి